క్లుప్తంగా

జల సంరక్షణకు ప్రభుత్వం కృషి



ఫిరంగిపురం: జల సంరక్షణకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని ఎమ్మెల్యే టి.శ్రావణ్ కుమార్ అన్నారు. పొనుగుపాడు గ్రామంలోని కాలువ దగ్గర పొలంలో శనివారం ప్రపంచ జలదినోత్సవం సందర్భంగా నీటి కుంటలు తీసే కార్యక్రమానికి ఆయన శంకుస్థాపన చేశారు. వేసవిలో గ్రామీణ ప్రాంతాల్లో పనుల్లేక కూలీలు తీవ్రంగా ఇబ్బంది పడుతుంటారని వారికోసం కేంద్రప్రభుత్వం మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పని కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ శంకర్, ఇన్‌చార్జి ఎంపీడీవో రవిబాబు, ఈవోపీఆర్డీ వెంకటేశ్వర్లు, ఏపీవో జయకుమార్, తహసీల్దార్ జె.ప్రసాదరావు, కోటేశ్వరరావు, మండవ నరసింహారావు, ఎన్.రవి, నాయకులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడిలో బాలుడికి గాయాలు



మంగళగిరి టౌన్ : మంగళగిరి నగర పరిధిలోని గోపాలకృష్ణ థియేటర్ వెనుకవైపు ఒక బాలుడిపై వీధి కుక్కలు శనివారం దాడి చేశాయి. సీతారామాంజనేయ పేటకు చెందిన పల్లపు నిహాల్‌ను పాఠశాలకు వెళ్తుండగా.. వెనుక నుంచి వీధి కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో బాలుడికి వీపు, చేతులు, కాళ్లమీద గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కుక్కలను తరిమి కొట్టి, బాలుడిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. చికిత్స నిమిత్తం నిహాల్‌ను ఆసుపత్రికి తరలించారు. స్థానికులు మాట్లాడుతూ కుక్కలు స్వైర విహారం చేస్తూ దాడులు చేస్తున్నాయని తెలిపారు. సమస్యను అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సేద్యపు కుంటకు భూమి పూజ



దుగ్గిరాల: జాతీయ జల దినోత్సవం సందర్భంగా ఉపాధి హామీ పథకం ద్వారా మోరంపూడిలో శనివారం సేద్యపు కుంట, వ్యవసాయ కుంటల ఏర్పాటుకు భూమి పూజ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ జాన్ బీ సేద్యపు కుంటకు భూమి పూజ చేశారు. మండల అభివృద్ధి అధికారి ఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలో 50 గ్రామాలకు ఫాం పాండ్స్ టార్గెట్ ఇచ్చినట్లు తెలిపారు.వాటిలో 19 గ్రామాలకు నీటి కుంటలు మంజూరైనట్లు చెప్పారు. ఇత్తడి రమేష్, గ్రామపెద్దలు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

తెనాలిటౌన్: క్రీడలు మనిషి శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని డీఎస్పీ బి.జనార్దనరావు పేర్కొన్నారు. స్థానిక షరాఫ్‌బజార్‌లోని శ్రీ కామాక్షి స్వర్ణకార సంఘ భవనంలో శనివారం ఏర్పాటు చేసిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఎస్పీ బి.జనార్దనరావు హాజరయ్యారు. ఫిబ్రవరి నెలలో శ్రీ కామాక్షి స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. విజేతలైన రాయల్ ఛాలెంజ్‌కు టీంకు మొదటి బహుమతిగా రూ.10వేలు, ట్రోఫీ, రన్నర్ టీంకు రూ.5000లు, ట్రోఫీ డీఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఏర్పాటు చేసి యువతను క్రీడల్లో ఉన్నతంగా రాణించేలా ప్రోత్సహించడం అభినందనీయమని డీఎస్పీ కొనియాడారు. అనంతరం స్వర్ణకార సంఘ సభ్యులకు ఐడీంటిటీ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు గొల్లపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి షేక్ నాసర్ అహ్మద్, కోశాధికారి మునగాల శ్రీనివాస్, జిల్లా ప్రెసిడెంట్ తాడేపల్లి మహేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మొహిద్దీన్, 19వ వార్డు కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి, టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు మహ్మద్ ఖుద్దూస్, వెండి అసోసియేషన్ ప్రెసిడెంట్ పి.ఫజిల్ ఖాన్, కార్యదర్శి పఠాన్ జిలానీ ఖాన్ పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

వేమూరు: భట్టిప్రోలు మండలంలోని కేఎస్‌కే విద్యా సంస్థలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైస్ ప్రిన్సిపాల్ రాజేష్ విక్టర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. కంటి సమస్యలు ఉన్న వారికి కళ్లజోళ్ల పంపిణీతో పాటు ఉచితంగా ఆపరేషన్లు కూడా చేయించనున్నట్లు వెల్లడించారు.గ్రామస్తులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జోరందుకున్న నీటి వ్యాపారం

- పుట్ట గొడుగుల్లా మినరల్ వాటర్ ప్లాంట్లు
- భద్రతా ప్రమాణాలు పాటించని నిర్వాహకులు
- క్యాన్లు కూడా శుభ్రం చేయకుండా సప్లయ్
- ప్రశ్నార్థకంగా ప్రజల ఆరోగ్యం



మినరల్ వాటర్ అంటూ ఊరు, పేరు లేకుండా అమ్ముతున్న వాటర్ క్యాన్లు

తాడేపల్లిరూరల్: మారుమూల ప్రాంతాల్లో సైతం భూగర్భ జలాలు కలుషితం కావడంతో గ్రామాల్లో కూడా ప్రతి రోజు మినరల్ వాటర్‌నే వినియోగిస్తున్నారు. క్యాన్ వాటర్ విక్రయాలు పెరగడంతో అదే అదునుగా తీసుకుని కొంతమంది వ్యాపారులు మినరల్ వాటర్ పేరుతో సరిగా శుద్ధి చేయకుండా జనరల్ వాటర్‌ను సరఫరా చేస్తున్నారు. మంగళగిరి నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 200కుపైగా వాటర్ ప్లాంట్లు ఉన్నాయి. ఈ వాటర్ ప్లాంట్‌లలో కనీస నాణ్యతా ప్రమాణాలు, శుభ్రత పాటించకుండా నీటిని సరఫరా చేస్తున్నారు. మినరల్ వాటర్ పేరుతో క్యాన్లలో నింపుతున్న నీరు ఎంతవరకు సురక్షితం అనేది ఎవరూ పరిశీలించడం లేదు. వినియోగించే ప్రజలు కూడా వీటిని గుడ్డిగా కొనుగోలు చేస్తున్నారు. ఒక క్యాన్ రూ.20 నుంచి రూ.30లకు విక్రయిస్తున్నారు. వేసవిలో కూలింగ్ వాటర్ క్యాన్ రూ.40 నుంచి రూ.50లకు విక్రయిస్తున్నారు. ప్రతి వాటర్ ప్లాంట్ల యజమానులు సేల్స్ బాయ్స్‌ని పెట్టుకుని ఇళ్లకు సప్లయ్ చేస్తున్నారు. ఆ క్యాన్లు సప్లయ్ చేసేవారు కనీసం శుభ్రపరచకుండా వాడిన క్యాన్లలోనే మరలా నీటిని పట్టి ప్రజలకు అందజేస్తున్నారు. ఒక్కో ప్లాంట్ వద్ద ప్రతిరోజు 350 నుంచి 500 వరకు క్యాన్లు.. క్యాన్ రూ.20ల చొప్పున విక్రయిస్తున్నారు. సుమారు 400 క్యాన్లు చొప్పున మంగళగిరి నియోజకవర్గ వ్యాప్తంగా 200 ప్లాంట్లు ఉండగా ప్రతి రోజు 80 వేల క్యాన్ల తాగునీరు అవుతోంది. సుమారు రూ.16 లక్షల వ్యాపారం జరుగుతోంది. ఇంత భారీ ఎత్తున వ్యాపారం జరుగుతున్నా అధికారులు ఈ ప్లాంట్ల వైపు కనీసం కన్నెత్తి చూడడం లేదు. నిబంధనలను పరిశీలించడం లేదు.

నిబంధనలు ఇవే....

ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం నీటిలో ఫ్లోరైడ్, పీహెచ్, ఖనిజ లవణాలను శుద్ధి చేయాలి. మినరల్స్ పూర్తిగా తీసేయకూడదు. నీటిని నింపే ముందు డబ్బాలను శుభ్రం చేయాలి. శుద్ధి చేసేటప్పుడు ఫైబర్ ఫిల్టరింగ్‌తో నీటిలో మలినాలు లేవని నిర్ధారణ అయ్యేంత వరకు ప్రతి రెండు నిమిషాలకు ఒకసారి నీటిని పరీక్షించాలి. మలినాలు, బ్యాక్టీరియా లేకుండా శుద్ధి చేసే మెంబ్రియాలను వాడాలి. బాటిళ్లను బ్లీచింగ్ పౌడర్, లిక్విడ్ క్లోరిన్ కలిపిన నీటితో కడగాలి. నీటిలో ఫ్లోరైడ్ శాతం 1.0మిల్లీ గ్రాములలోపు ఉండాలి. కానీ కొన్ని వాటర్ ప్లాంట్ల వారు సరఫరా చేస్తున్న నీటిలో అది 2 మిల్లీ గ్రాముల వరకూ ఉంటోంది. నీటిలో కరిగే లవణాలు కనీసం 150 మిల్లీ గ్రాముల వరకు ఉండాలి.

అంతా అపరిశుభ్రత

అయితే నీటి ప్లాంట్ల నిర్వాహకులు ఈ నిబంధనలను పాటించడం లేదు. దీంతో నీటిలో బ్యాక్టీరియా మరీ ఎక్కువగా ఉంటే కలరా, ఇతర వ్యాధులు సోకే అవకాశాలు ఉన్నాయి. శుద్ధి చేయని నీటిలో బ్యాక్టీరియా మరీ ఎక్కువగా ఉంటే కలరా, ఇతర వ్యాధులు సోకే అవకాశాలు ఉన్నాయి. శుద్ధి చేయని నీటిలో బ్యాక్టీరియా వేగంగా పెరుగుతుంది. దీని వల్ల గొంతునొప్పి, జీర్ణకోశ సంబంధ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు పేర్కొంటున్నారు. క్యాన్లు శుభ్రం చేయకుండా వాటిల్లోనే నీటిని నింపడంతో ఫంగస్ కేన్లలో ఏర్పడుతోంది. వాటర్‌ప్లాంట్ వారు నీటిని ఫిల్లింగ్ చేసే సమయంలో కనీస జాగ్రత్తలు కూడ పాటించకపోవడంతో ఆ నీరు కలుషిత మవుతోంది.

వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు అనుమతులు ఇలా..

- ఎస్ఎస్ఐ రిజిస్ట్రేషన్
- బీఐఎస్ రిజిస్ట్రేషన్ సర్టిఫికేషన్
- కాలుష్య నియంత్రణ ధృవీకరణ
- ముడి, స్వచ్ఛమైన నీటి పరీక్ష నివేదికలు
- ట్రేడ్ మార్క్ నమోదు
- కెమిస్ట్- డిగ్రీ, వైద్య సర్టిఫికేట్
- మైక్రోబయాలజిస్ట్ – డిగ్రీ, వైద్య సర్టిఫికేట్
- కార్మికులకు వైద్య సర్టిఫికేట్
- గ్రామ పంచాయతీ ఎన్‌టీసీ (వర్తిస్తే)

కేఎల్‌యూలో సినీ ఫిలియా–2025 పోస్టర్ విడుదల



పోస్టర్ విడుదల చేస్తున్న వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ

తాడేపల్లిరూరల్: వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీలో జాతీయస్థాయి షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ అధికారిక పోస్టర్‌ను శనివారం వర్సిటీ వీసీ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్, లలిత కళా విభాగాధిపతి డాక్టర్ వై.సుభాష్ తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ మాట్లాడుతూ సినీ ఫిలియా–2025 పేరుతో జరుగనున్న జాతీయస్థాయి లఘు చిత్రాల పోటీల్లో షార్ట్ ఫిల్మ్ స్క్రీనింగ్‌లు, ఇంటరాక్టివ్ సెషన్‌లు, పలు రకాల పోటీలు ఉంటాయన్నారు. లలిత కళా విభాగాధిపతి డాక్టర్ వై.సుభాష్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, ఎంహెచ్ఎస్ అంతర్జాతీయ సంబంధాల డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు, డాక్టర్ ఎ. శ్రీనాథ్, లలిత కళా విభాగాధిపతి సుభాష్ పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం



తాడేపల్లిరూరల్ : వేసవిలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ మంజు భవాని అన్నారు. శనివారం ఎంటీఎంసీ పరిధిలోని పోలకంపాడులో కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ సూచనల మేరకు స్వచ్ఛందంగా చలివేంద్రాలు ఏర్పాటు చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం బాటసారులకు, చిన్నారులకు మజ్జిగ పంపిణీ చేశారు. అంజనాద్రి డోర్స్ అధినేత లంక వంశీరెడ్డి, డాక్టర్ బి. దుర్గాప్రసాద్, సూరి రాఘవేంద్రరావు, తోట వంశీ, నాగుల్ మీరాతో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం



కార్మికులతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

తాడేపల్లిరూరల్ : ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు గత 108 రోజులుగా నిర్వహిస్తున్న దీక్ష శిబిరాన్ని ఆయన యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్‌తో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో భాగంగా నారా లోకేష్ ఈ ప్రాంతాన్ని పరిశీలించినపుడు కార్మికుల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఇస్మాయిల్, సుబ్బారావు, యహోషువా, అంకయ్య, సాంబయ్య, ఇమాంబి, రిబ్కా, సామ్రాజ్యం, రమణ తదితరులు పాల్గొన్నారు.

అరకొర నిధులతో తల్లికి వందనం అమలుపై అనుమానాలు

ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి. ప్రభావతి



సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి. ప్రభావతి

తాడేపల్లిరూరల్ : కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు తల్లికి వందనం పేరుతో ప్రకటించిన పథకాన్ని అమలు చేయాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి. ప్రభావతి, ప్రధాన కార్యదర్శి డి. రమాదేవి డిమాండ్ చేశారు. శనివారం కొలనుకొండ ఐద్వా రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి, వారు మాట్లాడారు. ఇంట్లో ఎంతమంది విద్యార్థులుంటే అంతమందికి తల్లికి వందనం అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. జూన్ మాసంలో అమలు చేస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రకటించిన తాత్కాలిక బడ్జెట్‌లో తల్లికి వందనం పథకానికి రూ.5,387 కోట్లు ప్రకటించి ఒక్క పైసా కూడా ఖర్చు పెట్టలేదని ఆరోపించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో తల్లికి వందనం పథకానికి కేవలం రూ.9,407 కోట్లు మాత్రమే కేటాయించారని గుర్తుచేశారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం రాష్ట్రంలో 1 నుంచి ఇంటర్ వరకు చదువుకునే విద్యార్థులు 87 లక్షల మంది ఉన్నారని, ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున రూ. 13,113 కోట్లు అవుతుందని లెక్కలు వివరించారు. ఈ అరకొర నిధులతో తల్లికి వందనం అమలు చేస్తారా? లేదా? అనే అనుమానం వ్యక్తమవుతోందని పేర్కొన్నారు.

కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా వైఎస్సార్ సీపీ


వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి



కార్యకర్తలతో మాట్లాడుతున్న వేమారెడ్డి

దుగ్గిరాల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం ఎల్లప్పుడు కార్యకర్తలకు అండగా ఉంటుందని ఆ పార్టీ మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి అన్నారు. చింతలపూడి, చుక్కవారిపాలెంలో శనివారం పార్టీ క్రియాశీల కార్యకర్తల సమావేశాన్ని ఆయన నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ.. ప్రతి కార్యకర్త అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పార్టీ నాయకులపై అనేక అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. వాటిని పార్టీ ధీటుగా ఎదుర్కొంటుందని, ఇబ్బందులు పడే నాయకులకు, కార్యకర్తలకు అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, మండల అధ్యక్షుడు తాడిబోయిన శివగోపయ్య, జానీబాషా, స్థానిక నాయకులు, కారకర్తలు పాల్గొన్నారు.

ఎన్నారైలో ప్రపంచ జల దినోత్సవం



అవార్డు ప్రదానం చేస్తున్న డాక్టర్ చంద్రమౌళి

మేడికొండూరు: మండలంలోని విషదల అడ్డ రోడ్డు సమీపంలోని ఎన్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ప్రపంచ జల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ కోట శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి మంచినీటి వనరుల సుస్థిర నిర్వహణపై అవగాహన కల్పించేందుకు ఏటా మార్చి 22న ప్రపంచ జల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.నీటి నిర్వహణ, పరిరక్షణపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని తెలియజేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ శ్రీహరి మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు నీటి నిర్వహణ ఎంతో మంచి చేకూరుస్తుందన్నారు. కళాశాల సెక్రటరీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.శరత్ హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులకు వ్యాసరచన, బృంద చర్చలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల ఈడీ తిలక్ బాబు, సీతారామయ్య వివిధ శాఖల అధిపతులు రెహమాన్, రాము, నాగేశ్వరావు, సౌజన్య, కేఎస్ఆర్, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

దర్గాలో ఇఫ్తార్ విందు

లక్ష్మీపురం: మహబూబ్ సుభాని 21వ మనవలు హజరత్ సయ్యద్ షా మొహిద్దీన్ బాషా ఖాదిరి బాబా దర్గాలో చంద్రమాన 21వ రోజు సందర్భంగా దర్గా పీఠాధిపతి సయ్యద్ షా సులేమాన్ ఖాదిరి ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రంజాన్ సందర్భంగా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా పీఠాధిపతి సులేమాన్ ఖాదిరి మాట్లాడుతూ గుంటూరు జిల్లా చుట్టుపక్కల నుంచి ఎంతో భక్తిశ్రద్ధలతో కుల మతాలకతీతంగా బాబా ఆశీస్సులు మెండుగా ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా సోదర భావంతో ఉండాలన్నారు. రంజాన్ శుభమాసంలో దర్గా ప్రాంగణంలో భక్తుల సమక్షంలో ఇఫ్తార్ విందుకు పాల్గొనడం చాలా ఆనందదాయకంగా ఉందన్నారు. కార్యక్రమంలో స్థానికులు దర్గా మూరీధులు తదితరులు పాల్గొన్నారు.

నూరు శాతం చెత్త సేకరణ చేయండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: పట్టణంలో నూరు శాతం చెత్త సేకరణ జరగాలని, ఆ దిశగా అధికారులు, సిబ్బంది పని చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. గంగానమ్మపేటలో శనివారం పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. తెనాలిలో మూడు బుట్టల విధానం సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు కూడా రోడ్లు, కాల్వల్లో చెత్త వేయకుండా సిబ్బందికి అంద జేయాలని సూచించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులు ఉన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

తాడేపల్లిరూరల్: వినియోగదారుల హక్కులపై కేఎల్ యూనివర్శిటీ బీఏ (ఐఏఎస్) ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మంగళగిరి రూరల్ పరిధిలోని నూతక్కి గ్రామంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వర్సిటీ విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ వినియోగదారులు మోసపూరిత చర్యలు, నాణ్యతలేని ఉత్పత్తులు విక్రయం జరిగినప్పుడు చట్టం ద్వారా న్యాయం పొందవచ్చని తెలిపారు. వలంటీర్లు ఇంటింటికి తిరిగి ఉత్పత్తుల సమాచారం, ధర, తయారీ, గడువు తేదీలు, కంపెనీ వివరాలు, వినియోగదారుల కమిషన్ లేదా ఫిర్యాదుల పరిష్కార ఫోరంలో ఫిర్యాదు వివరాలను ప్రజలకు వివరించినట్లు తెలిపారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆర్ట్స్ విభాగాధిపతి డాక్టర్ బి.శివనాగయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ పి. శ్రీకాంత్ రెడ్డి, ఫీల్డ్ కో ఆర్డినేటర్ పి.సురేష్ పాల్గొన్నారు.

1 నుంచి వేసవి ప్రత్యేక శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న ఎస్ఎల్. కాంత్

తాడేపల్లిరూరల్ : వేసవిలో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు కాష్వి ఆర్ట్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ ఎస్.ఎల్.కాంత్ తెలిపారు. శనివారం తాడేపల్లి ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఏప్రిల్ 1 నుంచి మే 31వ తేదీ వరకు ప్రత్యేక వేసవి శిక్షణ తరగతుల్లో ఫ్రీ హ్యాండ్ డ్రాయింగ్, పెన్సిల్ షేడింగ్, కార్టూన్ డ్రాయింగ్, పెయింటింగ్, మండల ఆర్ట్, ఫొటో షాప్ డిజైనింగ్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వం ఏటా నిర్వహించే టెక్నికల్ గ్రేడ్ లోయర్ / హయ్యర్ పరీక్షలకు, టెక్నికల్ ఉపాధ్యాయులు సర్టిఫికేట్ కోర్సులకు కూడా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ తరగుతులు నిర్వహిస్తారని వెల్లడించారు. ఆసక్తి గల వారు కుంచనపల్లి ప్రధాన రహదారి, రెడ్ల రామాలయం దగ్గర ఉన్న కాష్వి ఆర్ట్ ఇనిస్టిట్యూట్‌లో లేదా 96186 43653 నంబరుకు సంప్రదించవచ్చని తెలిపారు.

ప్రజా చైతన్య యాత్రలో సమస్యల ఏకరువు



ప్రజా చైతన్య యాత్రలో స్థానికుల సమస్యలు వింటున్న నాయకులు

మంగళగిరి టౌన్ : వివిధ ప్రజా సమస్యలను ఎవరికి చెప్పుకున్నా పరిష్కారం కావడం లేదని మంగళగిరి నగర పరిధిలోని రత్నాల చెరువు వాసులు ప్రజా చైతన్య యాత్రలో వాపోయారు. సీపీఎం మంగళగిరి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం రత్నాల చెరువులోని 21, 22 వార్డుల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా చైతన్యయాత్ర నిర్వహించారు. ఈ యాత్రలో ప్రజలు తమ సమస్యలను వివరించారు. అర్హులైన వృద్ధులకు, వింతతువులకు పెన్షన్లు ఇవ్వడం లేదని, ఇంటి పన్నుకోసం దరఖాస్తు చేసుకుంటే అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని తెలిపారు. కొత్త రేషన్ కార్డులు ఇవ్వడం లేదని చైతన్య యాత్రలోని నాయకులకు తెలియజేశారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి వీవీ జవహర్‌లాల్ మాట్లాడుతూ ప్రజా చైతన్యయాత్ర సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందన్నారు. ఈ సమస్యల పరిష్కారానికై ఈ నెల 25న ఎంటీఎంసీ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నామని తెలిపారు. సీపీఎం జిల్లా నాయకుడు చెంగయ్య, పట్టణ కార్యదర్శివర్గ సభ్యుడు బాలాజి పాల్గొన్నారు.

పంట కాల్వలోకి వ్యర్థాలను నిలువరించాలి



పంట కాలువను పరిశీలిస్తున్న మధు, నాయకులు

తాడేపల్లిరూరల్: కుంచనపల్లి వద్ద ఉన్న ఆంధ్ర రత్న పంపింగ్ స్కీమ్ పంట కాలువలోకి అపార్ట్‌మెంట్‌ల నుంచి వచ్చే వ్యర్థాల వెంటనే నివారించాలని మాజీ రాజ్యసభ సభ్యుడు పి. మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కుంచనపల్లిలో ప్రజా సంఘాల నాయకులతో కలసి పంట కాలువను పరిశీలించారు. ఎంటీఎంసీ పరిధిలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు. ఇప్పటికే కాలుష్యం బారిన పడి ప్రజలు వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. తాడేపల్లి పట్టణ, రూరల్ ప్రాంతాల్లో బహుళ అంతస్తుల భవనాల్లోని వ్యర్థాలను పంట కాలువలో కలుస్తుంటే అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులే మురుగు నీటిని మోటార్ల ద్వారా బకింగ్‌హామ్ కాలువలో కలపడం విచిత్రంగా ఉందన్నారు. తక్షణమే ప్రభుత్వం, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు స్పందించి ప్రజలు కాలుష్యం బారిన పడకుండా డ్రెయినేజీ వ్యవస్థను పటిష్ట పరచాలని డిమాండ్ చేశారు. శాశ్వత పరిష్కారం కోసం పట్టణ పరిధిలోని సీఎస్ ఆర్ కల్యాణ మండపం సమీపంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఐక్య కార్యాచరణ కమిటీ పేరుతో సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. సీఐటీయూ నాయకులు వై.నేతాజీ, ఎం.రవి, బూరగ వెంకటేశ్వరరావు, వేముల దుర్గారావు, ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్న శివశంకరరావు, పౌర సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఎడ్ల బలప్రదర్శన ఏర్పాట్ల పరిశీలన

తెనాలిరూరల్: ఆలపాటి శివరామకృష్ణయ్య మెమోరియల్ ట్రస్టు పేరున ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో మార్కెట్ యార్డులో ఈ నెల 29 నుంచి ఏప్రిల్ 4వరకు జరగనున్న ఎడ్ల బల ప్రదర్శన ఏర్పాట్లను వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు శనివారం పరిశీలించారు. అనుచరులకు పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి సంబంధించిన అధునాతన సాంకేతిక పనిముట్లు, హార్టి కల్చర్ వర్క్‌షాప్‌లు ఔషధ మొక్కలు ప్రదర్శన ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

నేటి నుంచి 'శిశిరం' రెండవ షెడ్యూల్ ప్రారంభం

తెనాలి: శ్రీకృష్ణ ఆర్ట్స్ పతాకంపై తెనాలి, పరిసరాల్లో చిత్రీకరణ జరుపుకుంటున్న బాలల సినిమా 'శిశిరం' రెండో షెడ్యూల్ ఆదివారం నుంచి ప్రారంభిస్తున్నట్లు చిత్ర దర్శకుడు కనపర్తి రత్నాకర్ వెల్లడించారు. స్థానిక విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ, తాజా షెడ్యూలు ఆటోనగర్ లోని సూర్య శిల్పశాల, బుర్రిపాలెంరోడ్డులోని వివేకానంద సెంట్రల్‌స్కూల్, రూరల్ మండలం సంగం జాగర్లమూడి, శేకూరు, కొలకలూరు గ్రామాల్లో మూడురోజులు జరుగుతుందని చెప్పారు. విద్యావ్యవస్థ ప్రధానాంశంగా చిత్రం వుంటుందన్నారు. ప్రముఖ బాలనటుడు 'తండేల్' ఫేమ్ లిటిల్ స్టార్ భానుప్రకాష్, మాస్టర్ పుష్కర్, బేబి అమృత, ట్రిహాన్స్ సిస్టర్స్ ప్రధాన బాలనటులు కాగా, స్థానిక కళాకారులు బెల్లంకొండ వెంకట్, కనపర్తి మధుకర్, సోమేష్, కోటేశ్వరరావు, గోము, వసంతయామిని, తులసి, ప్రియాంక, డాక్టర్ జీవనలత, ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి, రచయిత అయినాల మల్లేశ్వరరావు వివిధ పాత్రల్లో నటిస్తున్నారని చెప్పారు. శిశిరం చిత్రంలోని పాటలు ఆదిత్య మ్యూజిక్‌తో విడుదలైనట్లు తెలిపారు. తెనాలికి చెందిన యువ సంగీత దర్శకుడు శాండీ అద్దంకి సంగీతం సమకూర్చినట్లు తెలిపారు. కథ, స్క్రీన్ ప్లే వెంకట్‌ప్రసాద్, డైరక్టర్ అఫ్ ఫోటోగ్రఫీ ఎం.మురళీకృష్ణ, కెమెరా డి.మధు, స్టిల్స్ ఎస్.ఎస్.వి శేఖర్, డి.నాగరాజు, చరణ్ లు, ప్రొడక్షన్ డిజైనర్ ఎం.శ్రీకాంత్, కో–డైరెక్టర్ రావూరి రమణ, అసియేట్ డైరెక్టర్ వర్ధన్ రాజ్ లు పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ చిత్రానికి కో–ప్రొడ్యూసర్లుగా వెంకట్‌ప్రసాద్ అమిరినేని, సాదు చలపతి, కన్నెగంటి రవి, అనిల్ మూకిరి వ్యవహరిస్తున్నట్లు వివరించారు.